# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం 26 07 2025

సంపుటి 1 సంచిక 87

పేజీలు : 03

UDYAM / TS-09-0148996




## చరిత్రలో ఈ రోజు

1847: లైబీరియా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.
1856: వితంతు పునర్వివాహ చట్టం అమలులోకి వచ్చింది.
1975: హేతువాది, నాస్తికవాది గోపరాజు రామచంద్రరావు మరణం (జ.1902).
1956: ఈజిప్ట్ ప్రెసిడెంట్ నాసర్ సూయజ్ కాలువ ను జాతీయం చేసాడు.
1963: ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌కు పునాది వేశారు.
1999: కార్గిల్ విజయ్ దివస్. (చిత్రంలో)
2009: భారత దేశపు తొట్టతొలి పూర్తి స్వదేశీ నిర్మిత అణుజలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్ జలప్రవేశం.




# 430 కోట్లతో సిటీలో ఐకానిక్ బ్రిడ్జి

**రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం..! ఎయిర్ పోర్ట్‌కి వెళ్లే వారికి ప్రయోజనం..**



**దశ, హైదరాబాద్:** తెలంగాణంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించి.. దాన్ని విశ్వనగరంగా నిలిపేందుకు ప్రణాళికలు రచిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందుకోసం వేల కోట్ల రూపాయల ఖర్చుతో అనేక ప్రాజెక్టులు ప్రారంభించింది. ఈ క్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసకుంది. భాగ్యనగరంలో మరో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 430 కోట్ల రూపాయల ఖర్చుతో దీన్ని నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భాగ్యనగరంలోని చారిత్రక మీరాలం చెరువుపై.. రూ.430 కోట్లతో.. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో ఈ ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర పురపాలకశాఖ గురువారం అనుమతి మంజూరు చేసింది. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంఆర్‌డీసీఎల్ ఎండీ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలానే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, టెండరు ప్రక్రియను ఆలస్యం చేయకుండా.. వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఐకానిక్ బ్రిడ్జి నమూనాను.. ముందుగా ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూ, వరంగల్ నిట్ వంటి ప్రముఖ సంస్థలు పరిశీలించి నిపుణుల ఆమోదం పొందాక.. నిర్మాణ పనులు ప్రారంభించాలని పురపాలకశాఖ తెలిపింది.. ప్రభుత్వం మీరాలం చెరువుపై నిర్మించ తలపెట్టబోయే ఐకానిక్ బ్రిడ్జి పొడవు 2.5 కి.మీ ఉండనుంగా.. వెడల్పు 16.5 మీటర్లు ఉండనుంది. ఈ బ్రిడ్జిని.. చెరువుకు పశ్చిమాన ఉన్న చింతల్‌మెట్, తూర్పున శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు నేషనల్ హైవేను కలిపేలా నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల

..మిగతా 2వ పేజీలో →

# మెరుగైన వైద్యం అందించాలి

- * వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- * ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి
- * మందులు, ఔషధాలు సరిపడా ఉండాలి
- * రంగారెడ్డి కలెక్టర్ సీ. నారాయణ రెడ్డి
- * శంషాబాద్ సీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ



దశ , రాజేంద్ర నగర్ : 'ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి, సానిటేషన్ చేపట్టి, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి' అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని శంషాబాద్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా? లేదా ? అవసరమైతే తనకు తెలియజేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. హాజరు పట్టిక ప్రకారం వైద్యాధికారి, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు.

సి.హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి రోజూ ఎంతమంది అవుట్ పేషంట్, ఇన్ పేషెంట్లు వస్తుంటారని డాక్టర్ ను ప్రశ్నించారు. అన్ని వార్డులను సందర్శించి, వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వారం రోజుల్లో చర్యలు తీసుకొని శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డయాలసిస్ పేషంట్లకు అవసరమైన నీరు అందించేందుకు ఇబ్బందిగా ఉందని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా,. అందుకు కలెక్టర్ స్పందిస్తూ వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రభుత్వం వైద్యం, విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టినందున ప్రభుత్వ అంచనాలకు తగ్గట్టుగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సీ వైద్యాధికారి దుర్గలత, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## హోటల్ సీజ్ చేయకుండా ఉండేందుకు 2 లక్షల లంచం డిమాండ్

**ఏసీబీకి చిక్కిన డిప్యూటీ కమిషనర్ రవికుమార్**



**దశ, రాజేంద్రనగర్:** ఐదు లక్షలు రూపాయలు డిమాండ్ చేసి రెండు లక్షల రూపాయలను లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన ఘటన శుక్రవారం రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి పరిధిలోని సర్కిల్ టు డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న కే రవికుమార్ ఇటీవల ఓ హోటల్ లో జరుగుతున్న అక్రమాలు కనుగొన్నారు. అనంతరం హోటల్ ప్రతిష్ట దెబ్బతీయకుండా, సీజ్ చేయకుండా ఉండేందుకు ఐదు లక్షల రూపాయలను డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అందుకుగాను రెండు లక్షల రూపాయలు లంచంగా తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. రవికుమార్ పై కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్ పంపుతున్నట్లు అధికారులు తెలిపారు . ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన పక్షంలో ప్రజలు ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064, అదేవిధంగా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లలో ఫిర్యాదు చేయవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అధికారులు వివరించారు

## ఉమ్మడి జిల్లాలకు- ప్రత్యేక అధికారులు వీరే

**దశ, హైదరాబాద్: తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.**

| | |
|---|---|
| హైదరాబాద్ - | ఇలంబర్తి |
| రంగారెడ్డి- | డి. దివ్య |
| ఆదిలాబాద్- | సి. హరికిరణ్ |
| నల్గొండ - | అనితా రామచంద్రన్ |
| నిజామాబాద్ | ఆర్. హనుమంతు |
| మహబూబ్నగర్ | రవి |
| కరీంనగర్ | సర్ఫరాజ్ అహ్మద్ |
| వరంగల్ | కె. శశాంక |
| మెదక్ | ఎ. శరత్, |
| ఖమ్మం | కె. సురేంద్ర మోహన్ |

## ఫ్లాష్ న్యూస్ లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరు డీఎస్పీలు మృతి

**దశ, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఖైతాపురం వద్ద స్కార్పియో కారు ఓ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతిచెందిన వారు ఏపీకి చెందిన డీఎస్పీలు మేక చక్రధర్ రావు, కాంతారావుగా గుర్తించారు. ఏపీ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ లో పనిచేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది









## నా జోలికి వస్తే అడ్డంగా నరికేస్తా...?

**దశ, బంజారాహిల్స్:** నా జోలికి వస్తే అడ్డంగా నరికేస్తానంటూ ఒక వ్యక్తి టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై విరుచుకపడ్డాడు. బంజారాహిల్స్ లో రోడ్డు ఆక్రమణ చేసి ప్రహరీ నిర్మాణం చేస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో సర్కిల్ 18 టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలన కోసం వచ్చారు. టౌన్ ప్లానింగ్ అధికారుల మీద వ్యక్తి వీరంగం సృష్టించాడు. కారులోంచి కత్తి తీసి నరికేస్తా అంటూ బెదిరింపులకు దిగాడు. బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 లోని ఎమ్మెల్యే కాలనీలో ఘటన జరిగింది. దాంతో జిహెచ్ఎంసి అధికారులు స్థానికులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. కత్తి తో దాడికి యత్నించిన రామకృష్ణను పోలీసులు అరెస్టు చేసారు.

## రాజ్యసభ సభ్యుడిగా కమల్ ప్రమాణం



**దశ, న్యూఢిల్లీ:** సినీ నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ ఎట్టకేలకు పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కీలక ఘట్టం ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. కమల్ హాసన్ తన ప్రమాణ స్వీకారాన్ని తమిళ భాషలో చేశారు. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎమ్ఎన్ఎమ్ పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది.

# అశ్లీల కంటెంట్ ప్రసారాలపై నిషేధం




**దశ, న్యూ ఢిల్లీ :** దేశంలో అశ్లీల కంటెంట్‌పై నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఏదో ఒక మార్గంలో ఆ కంటెంట్‌ని ప్రసారం చేస్తున్నారు కొందరు. కొందరైతే.. అశ్లీల కంటెంట్ కోసం ఏకంగా యాప్స్‌ని తయారు చేసి.. దాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. అలా అశ్లీల కంటెంట్‌ని ప్రసారం చేస్తున్న యాప్‌లపై కేంద్రం కొరడ ఝుళిపించింది. ఉల్లు, ఎఎల్‌టిటి సహా 24 యాప్‌పై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించిన కేంద్రం.. ఆ వెబ్‌సైట్లు, యాప్‌లు ఇంటర్నెట్‌లో కనిపించకుండా చేయానలి ఇంటర్నెట్ ప్రొవైడర్లను ఆదేశించింది ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఒటిటి ప్రసార యాప్‌లు, వాటి సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పేర్కొంది. చట్టాలను ఉల్లంఘించే కంటెంట్‌ను ప్రసారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది.

**నిషేధించిన వెబ్‌సైట్లు ఇవే.. :** ఉల్లు, ఎఎల్‌టిటి, బిగ్ షాట్స్, బూమెక్స్, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, జల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్ ప్రైమ్, ఫినియో, షో ఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టివి, హాట్ఎక్స్ విఐపి, హల్‌చల్ యాప్, మూడ్ఎక్స్, నియాన్ఎక్స్ విఐపి, ఫ్యుగి, మోజ్‌ఫిక్స్, ట్రైఫ్లిక్స్.



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా ల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు శుక్రవారం ఉప్పల్ కూడలి వద్ద ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వాహనాల సజావుగా కదలిక మరియు ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. (దశ, ఉప్పల్ )

# దశ

నిజం.. నిర్భయంగా..




## మూసీ ప్రాజెక్టుకు భారీ వరద

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో పలు జిల్లాల్లో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జంట నగరాలలోని జలాశయాలు ఇదివరకే నిండుకుండలా మారాయి. వర్షాల వల్ల మూసీ ప్రాజెక్ట్ యొక్క పరివాహకపు (క్యాచ్మెంట్ ఏరియా) ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్ ఫ్లో బాగా పెరిగింది. ప్రస్తుతం మూసీ ప్రాజెక్ట్‌లోకి 1427 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం 8:00 గంటలకు మూసి ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల నుండి 1,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న కారణంగా సూర్యాపేట, నల్గొండ జిల్లాలలోని మూసీ నది పరివాహక గ్రామాల వారిని చాలా జాగ్రత్తగా ఉండాలని సూర్యాపేట ఇరిగేషన్ డివిజన్ నెం.1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూచించారు.



## అప్పులు -తిప్పలు

ధనం మూలం అవసరానికి
ఇల్లు కట్టాలన్న
చదువుకోవాలన్న
ఆరోగ్యం బాగుచేసుకోవాలన్న

పెండ్లి చేయాలన్న
పేరెంటాలను జరపాలన్న
పాడి, పశువును పెంచాలన్న
ఆఖరకు, పాడే మోయాలన్న

కూడుకు, గుడ్డకు
స్నేహం చేయాలన్న
దాహం తీర్చుకోవాలన్న
ప్రయాణం సాగించాలన్న

ఆధునిక ప్రపంచంలో
డబ్బు ప్రధానమైనది,
వ్యక్తికి విలువఇచ్చేది
హోదాను పెంచేది

అవసరానికి అప్పుచేస్తున్నారు
అధిక వడ్డీ చెల్లిస్తున్నారు
అసలుకన్నా మిత్తి ఎక్కువై
ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

అప్పు ఎంతకు తీరక
వడ్డీకి, వడ్డీ కట్టలేక
మల్లి అప్పులు చేయాలి
బ్రతుకంత తిప్పలు పడాలి

పెద్దోళ్లకు అప్పు పుడుతుంది
తక్కువ వడ్డీకే దొరుకుతుంది
సకాలంలో చెల్లించకున్న
చెల్లుబాటు అవుతుంది

పేదోడు కాళ్ళు అరిగేలా తిరగాలి
అప్పుకు జమానతు పెట్టాలి
ఎ తిప్పలైన పడి తీర్చాలి
లేకుంటే పాడేక్కాలి

ప్రభుత్వం ఋణ మాఫి చేస్తున్న
రాయితిలు కల్పిస్తున్న,
అకాల వర్షం లేదా కరువు పరిస్థితులు
పంట చేతికందకనో,ధరపలకకనో

అప్పుతీర్చలేక సామాన్యుడు
ఆత్మాభిమానము,అవమానంతో
కృంగి, కృషించి పోతున్నాడు
తిండి లేక తిప్పలుపడుచున్నాడు

అప్పు తప్పు కాదు
అధిక వడ్డీ సరికాదు
సమయమిచ్చి వసూలుచేయాలి
నిజాయితీగా ఉన్నవారిని ఆదుకోవాలి.

రచన: కడెం. ధనంజయ, చిత్తలూర్.

# నాలాలలో పారిశ్రామిక వ్యర్ధాలు



**దశ, కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల ఇండస్ట్రీయల్ లో పిసిబి అధికారుల పర్యవేక్షణ లోపం స్థానిక జనవాసాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది..చిన్న వర్షం పడితే చాలు నాలలో కెమికల్ వ్యర్థ రసాయనాలను వదిలి చేతులు దులుపుకుంటున్నారు ఇక్కడి కెమికల్ మాఫియా. ఇండస్ట్రీలో ప్రోడక్ట్ తయారీ అనంతరం మిగిలే వ్యర్థాలను జేఈటియల్,రాంకీ వేస్ట్ మేనేజ్ మెంట్ కి పంపితే లక్షల్లో ఖర్చు అవుతుందని నాలల్లో గుట్టుచప్పుడు కాకుండా కెమికల్ మాఫియా తో డంప్ చేయించి చేతులు దులుపుకుంటున్నారు ఇక్కడి కెమికల్,ఫార్మా కంపెనీల యాజమాన్యాలు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ లో ఎప్పటికప్పుడు నిఘా పెట్టి,కంపెనీల్లో తనీఖీలు చేపట్టాల్సిన పిసిబి అధికారులు కెమికల్ కంపెనీ యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రతినెల జేఈటియల్ కు పంపాల్సిన వ్యర్థరసాయనాల ట్యాంకర్ లీస్ట్ లను తప్పుదారి పట్టిస్తూన్నారని స్థానికుల ఆరోపణ రాత్రి వేళల్లో కెమికల్ నాలల వద్ద పిసిబి సిబ్బంది నిఘా కొరవడటంతోనే ఈ ఘటనలు తీవ్రంగా జరుగుతున్నాయని ఇప్పటికైనా గస్తీ పెంచి ప్రజల ప్రాణాలకు అధికారులే భరోసా కల్పించాలని నిరసన వ్యక్తం అవుతోంది ..

## హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**దశ , హుజురాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులపై హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సాకుగా చూపి ముఖ్యమంత్రి, మంత్రులపై కౌశిక్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గతంలో "ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా" అంటూ ప్రజలను మభ్యపెట్టి గెలిచిన కౌశిక్ రెడ్డి, ఇప్పుడు పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ నేపథ్యంలో, అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన నిరసన కార్యక్రమంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతేకాకుండా, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని కాంగ్రెస్ కార్యకర్తలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి ఎదురుదెబ్బ

**దశ, హైదరాబాద్:** ఐఏఎస్ ఆఫీసర్ శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో శుక్రవారం ఎదురుదెబ్బ తగిలింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో తనపై నమోదైనే కేసును కొట్టివేయాలంటూ ఆమె హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించాలని పిటిషన్‌లో శ్రీలక్ష్మి కోరారు. ఐఏఎస్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. సీబీఐ, ప్రతివాదుల వాదనలను పరిగణనలోకి తీసుకుంది. తాజాగా ఆమె పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. మైనింగ్ కేసులో ఇదివరకే కోర్టు ఆమెను నిందితురాలిగా తేల్చింది. తెలంగాణ కోర్టు తీర్పు రావడంతో ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ శ్రీలక్ష్మి పాత్రపై సీబీఐ విచారణ చేపట్టనుంది. ఓబులాపురం కేసు నుంచి ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి బయటపడ్డారని అంతా అనుకున్నారు. కానీ కేసులో శిక్షలు ఖరారైన మరుసటి రోజే సుప్రీంకోర్టు ఆమెకు షాకిచ్చింది. ఈ కేసు నుంచి శ్రీలక్ష్మిని హైకోర్టు గతంలోనే డిశ్చార్జ్ చేసింది. అయితే హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీంకోర్టు ఐఏఎస్ శ్రీలక్ష్మి పాత్రపై విచారణ చేయాలని ఆదేశించింది.

# ఎస్సీ వర్గీకరణ చట్టంను సవరించాలి

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు



దశ, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం 2025 వలన మాలలతో పాటు ఎస్సీ లోని 26 కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని మాల మాహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని గోపోజు రమేష్ బాబు నేతృత్వంలో మాల సంఘాల ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం 2025ను సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని కోరారు. ఇక్కడ పేరుకు 5శాతం రిజర్వేషన్ ఉన్నా ఒక్క శాతం రిజర్వేషన్ మాత్రమే మాల, మాల అనుబంధ 26 కులాలకి రావడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లను నిలపుదల చేయాలని ఆయన కోరారు. చట్ట సవరణ తర్వాతే ఉద్యోగాల నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాల మాహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొండ్ర రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాట సింగర్ రైతు సేవాకార సహకార సంఘంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉషారాణి , అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ పద్మజ , ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సుజాత , అగ్రికల్చర్ ఆఫీసర్ అబ్దుల్లాపూర్మెట్ పల్లవి సంఘాన్ని సందర్శించారు. యూరియా కొరతపై వస్తున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండలంలోని పలు ఫర్టిలైజర్ షాప్ లను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

---(దశ, అబ్దుల్లాపూర్ మెట్ )--

## వ్యాధుల నియంత్రణకు చర్యలు: డిప్యూటీ మేయర్



**దశ నాచారం:** వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులతో, అక్కడికి వచ్చిన పేషంట్లతో మాట్లాడారు. పీహెచ్సీలను మినీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు.అందుకు అనుగుణంగా ఇక్కడి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనీ సూచించారు. ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న విష జ్వరాలు, డెంగ్యూ, టైయిపాయిడ్, మలేరియా వంటి వాధ్యులను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలనీ వైద్యులకు సూచించారు. అవసరమైతే బస్తీల్లో, కాలనీల్లో ప్రత్యేక వైద్య శిభిరాలను నిర్వహించాలన్నారు. తెలంగాణ డయాగ్నాస్టిక్స్, ఆరోగ్య శ్రీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్రెడ్డి, సిబ్బంది హేమలత, గీత తదితరులున్నారు.

## నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

### పెద్ద అంబర్‌పేట్ లో రేషన్ కార్డుల పంపిణీ

దశ, అబ్దుల్లాపూర్‌మెట్ : రాష్ట్ర ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీకి రానున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ తారా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డుల అందజేయనున్నారు. కొత్తగా రేషన్ కార్డులు మంజూరు అయినా లబ్దిదారులు శనివారం 03:00 గంటలకు వరకు తారా కన్వెన్షన్ హాల్ కు రావాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## వ్యాక్సిన్ తో సర్వైకల్ క్యాన్సర్ కు దూరం!




**దశ, హైదరాబాద్:** అవగాహన లేకపోవడంతో సర్వైకల్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని పలువురు వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐ) నేతృత్వంలో ప్రజారోగ్య చైతన్యంలో భాగంగా 'కాంకర్ హెచ్పీవీ, క్యాన్సర్ కాంక్లేవ్ 2025' పేరుతో సదస్సు బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్లో నిర్వహించారు. ఇండియన్ మెనోపాజ్ సొసైటీ ఆంకాలజీ కమిటీ చైర్పర్సన్‌ఎం .త్రిపురసుందరి అధ్యక్షతన వహించారు. గైనకాలజికల్ ఆంకాలజిస్ట్ డా.లీల, గైనకాలజిస్ట్ డా. సుధ, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. నివలిక రాజమోని, పీడియాట్రీషన్లు డా. ఎం.సురేంద్రనాథ్, డా.కె.పవన్ కుమార్ మాట్లాడారు.. '9 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇది దేశం లోనే తయారు కావడంతో పాటు అందరికీ అందుబాటు వ్యయంలో లభిస్తోంది. ఈ వ్యాక్సిన్ తో పురుషుల్లో పెనాల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉండదు. దీనిపై అవగాహన పెంచడానికి ప్రయత్నం చేస్తామ'ని వివరించారు.

# డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపండి

### పోలీసులను కోరుతున్న డ్రగ్స్ వినియోగిస్తూ దొరికిన వారు



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసుల ముందు అంగీకరించిన 14 మంది... ఇప్పుడు తమ జీవితాలను మార్చుకునే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నారు. శిక్ష కాకుండా తాము మారే విధంగా చికిత్స అందించాలని వారు పోలీసులను అభ్యర్తించారు.హైదరాబాద్‌లో డ్రగ్స్ తీసుకున్నట్టు అంగీకరించిన 14 మంది శిక్షకు బదులుగా చికిత్సను ఎంచుకున్నారు. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నారు. తెలంగాణ పోలీసుల ఈగల్ టీమ్.. తెలిపిన ప్రకారం.. వీరంతా గవర్నమెంట్ గుర్తింపు పొందిన డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్సకు ముందుకు వచ్చారు. వారు కావాలనుకున్నది శిక్ష రద్దు కాదు, తమ తప్పును ఒప్పుకుని జీవితాన్ని మార్చుకునే అవకాశం అని పోలీసులు ఉన్నతాధికారులు తెలిపారు.చిన్న మొత్తంలో డ్రగ్స్ తీసిన వారి కోసం... ఎన్ డి పి ఎస్ చట్టంలోని 64A సెక్షన్ ఒక మార్గం చూపుతోంది. వ్యసనానికి లోనైనవారు తమపై కేసులు ఉన్నా సరే.. వాలంటరీగా చికిత్స కోరితే, శిక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది. కానీ ఇక్కడో కండీషన్ ఉంది. తప్పకుండా పూర్తి చికిత్స తీసుకోవాలి. మధ్యలో ఆపేస్తే మళ్లీ కేసు రీఓపెన్ అవుతుంది.ఇప్పుడు ఈ 14 మంది నెలరోజులపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పునరావాస కేంద్రాల్లో చికిత్స పొందనున్నారు. డ్రగ్స్‌ను మానడం ఒక స్టెప్ మాత్రమే కాదు... పూర్తిగా జీవనశైలిని మార్చే ప్రయాణం అని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం వ్యక్తిగత మార్పు కాదు, సమాజానికి పంపే శక్తివంతమైన సందేశం అంటున్నారు. ఒకసారి ఓ తప్పు చేశామంటే జీవితాంతం శిక్షించాల్సిన అవసరం లేదు. వారు తప్పు గుర్తించి మారాలంటే... చట్టమే రక్షణగా నిలబడుతుంది అన్నది పోలీసులు చెబుతున్న మాట.

## బట్టి ఆదేశాలతో ఐదుగురి ప్రాణాలు కాపాడిన అధికారులు

**దశ, ఖమ్మం:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఐదుగురి ప్రాణాలు కాపాడారు. చింతకాని మండలం చిన్న మండవ మున్నేరు వరద లో ఐదుగురు చిక్కుకున్నారు. కుల గణన సర్వే ప్రెజెంటేషన్ పని పై ఢిల్లీలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో వెంటనే స్పందించిన రెవిన్యూ, పోలీస్ అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. గేదెలు మేపుకునేదుకు వెళ్లి అకస్మాత్తుగా పెరిగిన వరదలో చిక్కున్న వారిని ఎన్డీఆర్ఎఫ్ సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. ఐదుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసారు .

## 430 కోట్లతో సిటీలో ఐకానిక్ బ్రిడ్జి


**మొదటి పేజీ తరువాయి**


చింతల్‌మెట్, శాస్త్రిపురం, అత్తాపూర్, కిషన్‌బాగ్, బహదూర్‌పుర ప్రాంతాల్లోని వాహనదారులకు.. అలానే చింతల్‌మెట్ నుంచి బెంగళూరు ఎన్‌హెచ్ ద్వారా ఎయిర్ పోర్ట్‌కి వెళ్లే వారికి ప్రయోజనం కలగనుంది. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. నిజాం కాలంలో ఈ చెరువును నిర్మించారు. భాగ్యనగర వాసుల దాహం తీర్చేందుకు మూడో నిజాం ఈ చెరువును నిర్మించారు. చెరువు నిర్మాణం పనులు జులై, 1804లో ప్రారంభం అయ్యి రెండేళ్ల వ్యవధిలో అనగా 1806లో పూర్తయ్యాయి. నిజాం సంస్థానంలో దివాన్‌గా పని చేసిన మీర్ ఆలం బహదూర్ పేరును ఈ చెరువుకు పెట్టారు. ఈ చెరువు కట్ట నిర్మాణం అర్ధ చంద్రాకారంలో ఉండి జనాలను విపరీతంగా ఆకట్టుకుంటుంది. చెరువు మధ్యలో మూడు దీవులుంటాయి. చెరువు నిర్మించినప్పుడు దీని విస్తీర్ణం 600 ఎకరాలు కాగా.. ప్రస్తుతం అది 450ఎకరాలకు పరిమితమైంది. ఈ చెరువు దిగువన జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండింటిని ఐకానిక్ బ్రిడ్జితో అనుసంధానం చేసి.. పర్యాటకులను ఆకట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

దశ
నిజం.. నిర్భయంగా..

03
శనివారం
26-7-2025
WWW.
DASHANEWS
.COM

## డాన్ బ్రాడ్‌మాన్‌ను అధిగమించిన జో రూట్

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన నాల్గవ టెస్ట్‌లో 3వ రోజు ఇంగ్లాండ్ భారత్‌పై ఆధిపత్యం చెలాయించడంతో, జో రూట్ రాహుల్ ద్రవిడ్, జాక్వెస్ కాలిస్ మరియు రికీ పాంటింగ్‌లను అధిగమించి టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో 2వ స్థానానికి చేరుకున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 135 ఓవర్లలో 544/7 స్కోరును చేసింది. భారత జట్టు మొదటి ఇన్నింగ్స్ మొత్తం 358కి 186 పరుగుల కంటే ఆధిక్యంలో ఉంది. రూట్ 150 పరుగులు చేసి, పలు రికార్డులను బద్దలు కొట్టాడు. ఒకే ప్రత్యర్థిపై స్వదేశంలో అత్యధిక టెస్ట్ సెంచరీలు చేసిన డాన్ బ్రాడ్‌మాన్‌ను రూట్ అధిగమించాడు. భారతదేశంపై అత్యధిక టెస్ట్ సెంచరీలు చేసిన స్టీవ్ స్మిత్‌ను అధిగమించాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అర్ధ సెంచరీ చేశాడు.



# బురద ఇలా.. నడిచేదేలా..!

### ఆస్పత్రి ప్రాంగణం అధ్వానం
### నిలిచిన వర్షపు నీరు
### తెరిచి ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూతలు








**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆస్పత్రి ప్రాంగణం అస్తవ్యస్తంగా తయారయ్యింది. గత రెండు రోజుల నుండి జిల్లా కేంద్రంలో అడప తడప కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు ఆసుపత్రి ప్రాంగణంలో నిలిచి ఉండడంవల్ల ఇటు రోగులకు అటు సందర్శకులకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య గత కొద్ది రోజులుగా ఉన్నప్పటికీ పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. వ్యాధుల సీజన్ ప్రారంభం కావడంతో కొత్తగూడెం ప్రధాని ఆసుపత్రికి ప్రజల తాకిడి ఎక్కువైంది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు ఆసుపత్రి ఓపి కార్యక్రమం ఉంటుంది. ఈ సమయంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకి బురద నీరు స్వాగతం పలకడం వల్ల వారికి నడకే నాట్యంగా మారింది. దవాఖాన పరిసర ప్రాంతాల్లో వరద నీరు నిలువ ఉండకుండా చూడడంతో పాటు రహదారి మధ్యలో ఏర్పడిన గుంటలను పూడ్చాలని సందర్శకులు డిమాండ్ చేస్తున్నారు.

#### ఆసుపత్రిలో ఆటోల పార్కింగ్...

కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ప్రైవేట్ ఆటోలు గంటల తరబడి పార్కింగ్ చేసి ఉండడంవల్ల ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. నిలిచిపోయిన వరద నీటితోపాటు అడ్డదిడ్డంగా ఆటోలు పార్కింగ్ చేసి ఉండటంవల్ల నడిచేదేట్లా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వచ్చిన రోగాన్ని తగ్గించుకునేందుకు ఆసుపత్రికి వస్తే అపరిశుభ్రంగా ఉన్న పరిసర ప్రాంతాలను చూస్తే కొత్త రోగాలు అంటుకునే ప్రమాదం ఉందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య అధికారులు వెంటనే స్పందించి ఆటోలు పార్కింగ్ చేయకుండా, దారిపై వరద నీరు గుంటలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

#### సెప్టిక్ ట్యాంకుతో కంపు...

జిల్లా ఆస్పత్రిలో ఓపి ఎమర్జెన్సీ బ్లాక్ ల ముందు సెప్టిక్ ట్యాంకులకు సంబంధించిన మూతలు తీసి ఉండడం వల్ల కంపు వస్తుందని సందర్శకులు అసహన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం సైతం అధ్వానంగా ఉందని వాపోతున్నారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తుందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం.. రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

**దశ, చౌటుప్పల్ :** యాదాద్రిభువనగిరి జిల్లాలో.. ఇందిరమ్మ ఇండ్ల పథకం పచ్చని సంసారంలో చిచ్చు పెట్టింది. సంస్థాన్ నారాయణపురం మండలం, జనగామ గ్రామంలో శిరీష కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యింది. ఇంటి నిర్మాణ పెట్టుబడి కోసం అత్త, మామలను డబ్బులు అడిగింది శిరీష. ఆ డబ్బుల విషయంలోనే అత్తాకోడళ్ల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ పంచాయితీ కాస్తా పోలీస్ స్టేషన్ కు వెళ్ళింది. అత్త మామలతో పాటు వారి కుటుంబ సభ్యులపైనా కోడలు పిర్యాదు చేసింది. కుటుంబ సమస్య కాబట్టి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని పోలీసులు సముదాయించారు. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుంటుండగానే.. అత్తా, కోడళ్ల కు చెందిన వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నాయి. పోలీసుల సమక్షంలోనే పొట్టు పొట్టుగా కొట్టుకున్నారు. గొడవను సద్దుమగించేందుకు పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. కాసేపు నారాయణపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణమంతా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో.. ఆందోళనకారులపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# 4 నెలలుగా జీతాల్లేని టీచర్స్..



### జీతం అందక ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు
### రాష్ట్రంలోని మోడల్ స్కూళ్ల పరిస్థితి

**దశ, నల్గొండ:** వారంతా చిరుద్యోగులే. నెలంతా పనిచేస్తే వారికొచ్చే జీతం రూ.15 వేల నుంచి రూ.19,500 వరకే. ఈ కాస్తంతా జీతం కూ డా అందక ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి రాష్ట్రం లోని మోడల్ స్కూళ్లలో నెలకొంది. గత నాలుగు నెలలుగా వారికి జీతాలు అందడంలేదు. మరో పది రోజులు గడిస్తే జూలై నెల కూడా పూర్తవుంతోంది.కానీ ఇంతవరకు వారికి జీతాలు అందని పరిస్థితి. నెలంతా ప నిచేస్తే ఇవ్వాల్సిన వేతనాలను సమయానికి అందించకపోవడంతో మోడల్ స్కూళ్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా జీతాలు ఆలస్యమవుతుండటం తో కుటుంబాలు గడవలేని పరిస్థితి అని ఉ ద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఈవిధంగా నెలల తరబడిగా వేతనా లు విడుదల చేయకపోవడం సరైంది కాదని నిలదీస్తున్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, దీనికితోడూ ఆలస్యంగా ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అసలే నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పిల్లలకు పుస్త కాలు, యూనిఫామ్ కొనాలన్న తమ వద్ద డబ్బులు ఉండడంలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లు ఉన్నా యి. ఒక్కో స్కూల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. వీరందరికీ గత మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెల వేతనాలు అందాల్సి ఉంది. ఇవి ఇంతవరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. జూలై నెల గడుస్తోంది. ఇంకో వారం, పది రోజులైతే ఐదు నెలల వేతనాలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంటుంది. ఒకట్రెండు నెలలు వేతనాలు ఆలస్యమైతే సర్దుకోవచ్చు కానీ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. జీతాలు ఎప్పుడొస్తాయో తెలియకపోవడం తో ఉద్యోగులు ఇంటి అద్దె, నెలవారి ఖర్చు లు, ఈఎంఐలు, ఇతర చెల్లింపుల విషయం లో ఇబ్బందులు పడుతున్నారు.

పెనాల్టీలతో చెల్లింపులు చేస్తున్నట్లు వాపోతున్నారు. కుటుంబాలు కూడా గడచే పరిస్థితిలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నేహి తులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి కు టుంబాలను పోషించుకుంటున్నారు. ఇదేదో ఒక నెల, రెండు నెలలు కాదు. ప్రతిసారి ఆలస్యంగానే అందుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. నేడు, రేపు అంటూ ఎప్పుడు వేతనాలు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థి నెలకొందంటున్నారు. ఇంటి నుంచి స్కూళ్లకు వెళ్లేందుకు కనీసం బైక్ పెట్రోల్‌కు డబ్బులు కూడా ఉండడం లేదని ఓ ఉద్యోగి వాపోయాడు. జీతాలు అందక చిరుద్యోగులు విలవిల్లాడుతున్నారు.

#### బడ్జెట్ లేదంటున్న అధికారులు

వచ్చేదే అరకొర జీతం... దీనికి నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. జీతాల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడంలేదని మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు. వీరి వేతనాలకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే స్టేట్ ఆఫీస్‌కు చేరాయి. ఇక్కడి నుంచి అధికారులు సైతం ఆర్థికశాఖకు పంపించారు. పంపించి రోజులు గడుస్తున్నా బిల్లుల విడుదలకు ఇంకా క్లియరెన్స్ రావడంలేదు. బడ్జెట్ లేదని అధికారులు సమాధానం చెబుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. అప్రూవల్ కాగానే జమ చేస్తామని అంటున్నారు. పైగా వచ్చినప్పుడే తీసుకోవాలని అధికారులు బదులిస్తున్నారు. తక్షణమే నాలుగు నెలల జీతాలు విడుదల చేయాలి. మా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. నిత్యావసర సరుకులు, రోజూవారి ప్రయాణ ఖర్చులకు డబ్బులు ఉండడంలేదు. గత ఆరు నెలలుగా ఇదేతంతు. సకాలంలో జీతాలు వేయడంలేదు. మొక్కుబడిగా జీతాలు చెల్లిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తారీఖున మాకు జీతాలు వేయాలి. జీతాలు ఆలస్యం కావడంతో ఈఎస్ఐ, పీఎఫ్ సకాలంలో చెల్లించడంలేదు.

## రేషన్ కార్డుతో ఎన్నో సంక్షేమ పథకాలు

### కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** రేషన్ కార్డు ఉంటే ఎన్నో సంక్షేమ ఫలాలు పొందవచ్చునని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను కొత్తగూడెం క్లబ్‌లో పాల్వంచ కనకదుర్గ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలకి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న పేదవారి కల నేడు నెరవేరిందన్నారు. ఇప్పటివరకు కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,633 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా 7,962 కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు జతపరచడం జరిగిందన్నారు. కొత్తగూడెం మండలంలో ప్రత్యేకంగా 1,733 కొత్త కార్డులు మంజూరు కాగా, 2,188 కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు చేర్చినట్లుగా చెప్పారు. ఇంకా దాదాపు 2,000 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, 600 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. పాల్వంచ మండల పరిధిలో నూతనంగా 1727 కుటుంబ సభ్యుల వివరాలు జతపరిచినవి 3584 కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణి సంబంధిత శాఖల అధికారులు రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశపు ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలు..

### లోక్‌సభలో రాహుల్ గాంధీ

**దశ, న్యూ ఢిల్లీ:** భారతదేశపు ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. అలాంటి ఓబీసీలకు అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'బాగిదారి న్యాయ మహా సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ఆర్ఎస్ఎస్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని అన్నారు. 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం తాను చేయగలిగినంత చేయలేకపోయానని అనిపిస్తోందని పశ్చాత్తాపం వెలిబుచ్చారు. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నానని, సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలమని వ్యాఖ్యానించారు. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. తెలుసుకోవడానికి ఓబీసీల చరిత్ర ఎక్కడుందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయని ఆరోపించారు. ఓబీసీలు వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

# గ్రామ పంచాయితీల్లో పోటీకి కండిషన్స్

### గొడ్డలిపెట్టుగా మారిన 1995 లో చేసిన పంచాయతీరాజ్ చట్టం.. ⇨ సవరణ చేస్తే బాగుంటుందని విజ్ఞప్తులు!

దశ, నల్గొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తి ఉన్నా.. ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉండటంతో నైరాశ్యానికి గురవుతున్నారు. వారికి 1995 లో చేసిన పంచాయతీరాజ్ చట్టం గొడ్డలిపెట్టుగా మారింది. దానిని సవరించాలని గతంలో గత ప్రభుత్వాలకు విజ్ఞప్తులు వచ్చినప్పటికీ చొరవ తీసుకోలేదు. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడల్లా గెలిచినవారిపై ఓడినవారు కోర్టులకు వెళ్లడం పరిపాటిగా మారింది. అయితే ప్రజాప్రభుత్వంపై ఆశావాహులు ఆశలు పెట్టుకున్నారు. మార్పులు చేసి తమకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. కోర్టుకు వెళ్తున్న ఘటనలు జనాభా నియంత్రణలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995 మే 30న పంచాయతీరాజ్ చట్టంలోని 21వ పేజీలో 3వ అంశంగా చేర్చారు. దీంతో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు కలిగినవారికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని రద్దు చేశారు. అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో చాలా మంది స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వెనుకంజ వేస్తున్నారు. ఎవరైనా పోటీ చేసి విజేతలుగా నిలిచినా ఓటమిపాలైన వారు కోర్టుకు వెళ్తున్న ఘటనలు ఉన్నాయి. అవికూడా ప్రతిసారి ఎన్నికల సమయంలో నిత్యకృత్యమయ్యాయి. కోర్టులు కొన్ని సార్లు తీర్పును త్వరగా వెలువరిస్తే మళ్లీ వారు పై కోర్టులకు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణను అసెంబ్లీ సమావేశాల్లో చేయడమేనని పలువురు పేర్కొంటున్నారు. అదే చట్టం చేసి 30 ఏళ్లుగడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సవరణ చేయలేదు. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కు 1995 పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయాలని విజ్ఞప్తులు వచ్చాయి. ఈ చట్టంతో పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లోనూ ఇద్దరుకంటే ఎక్కువ పిల్లలు ఉంటే అనర్హులు అని పేర్కొన్నారు. అయితే 2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ చట్ట సవరణ చేసి ఇద్దరు పిల్లలు అనే నిబంధనలు సడలించింది. దీంతో పోటీచేసేవారికి ఊరట లభించింది. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేవారికి నిబంధనలు సడలించలేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు 1995 చట్టం చేసిన చంద్రబాబునాయుడు ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత సవరణ చేశారు. పోటీచేసేందుకు అవకాశం కల్పించారు. అదే డిమాండ్ తెలంగాణలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సైతం ఈ అంశాన్ని పలు సందర్భాల్లో తీసుకొచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ ఉన్నా స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పలువురు అభిప్రాయపడుతున్నారు. వారికో న్యాయం వీరికో న్యాయమా ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసేవారికి, నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసే నేతలకు 1995చట్టంతో సంబంధం ఉండదు. వారికి ఎంతమంది పిల్లలు ఉన్నా అవకాశం కల్పిస్తారు. చట్టాలు సైతం చేస్తారు. కానీ గ్రామస్థాయిలో పోటీచేసే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అవకాశం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారికి ఒకన్యాయం, కిందిస్థాయి వారికి మరోన్యాయమా అనేది సర్వత్రా చర్చజరుగుతుంది. ఈ సమావేశంలో 1995 పంచాయతీరాజ్ చట్టంకు సవరణలు చేసేలా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే అంశాన్ని చర్చిస్తారా? లేకుంటే గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలనే అవలంభిస్తారా? చంద్రబాబు చేసిన 1995 చట్టంనే కొనసాగిస్తారా? అనేది చూడాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సవరణ చేస్తే బాగుంటుందని పలువురు విజ్ఞప్తులు చేస్తున్నారు. కేబినెట్ పైనే స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు సుముఖంగా ఉన్న ఆశావాహులు ఆశలు పెట్టుకున్నారు.

